క్లుప్తంగా

108 కలశాలతో శివలింగం



సత్యవేడు: మహాశివరాత్రి వేడకల్లో భాగంగా సోమవారం స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో 108 కలశాలతో శివలింగాకృతిని ఏర్పాటు చేసి రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు మల్లికార్జున, బాలాజీ దేవర్ రుద్రాభిషేకం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నాగలాపురం: మండలంలోని బైటకొడియంబేడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చంద్రబాబు(38) విద్యుత్ షాక్‌తో ఆదివారం రాత్రి ప్రాణాలొదిలాడు. గ్రామ వలంటీరు లీలావతి భర్త చంద్రబాబు. చింతకాయలు రాల్చుతుండగా చెట్టుపై కరెంటు తీగ తగిలి షాక్ గురై కింద పడ్డాడు. నాగలాపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే చంద్రబాబు మృతిచెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నివాళి

చంద్రబాబు మృతి సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సోమవారం మధ్యాహ్నం బైటకొడియంబేడుకు వెళ్లి చంద్రబాబు భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వైఎస్ఆర్ బీమా ద్వారా రూ.10 వేలు అందజేశారు.

బోరుకు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరులోని తాగునీటి బోరుకు సోమవారం సర్పంచ్ గంగయ్య, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ మరమ్మతులు చేయించారు. గ్రామంలో ఉన్న చేతి పంపు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి పంచాయతీ నిధులతో రిపేరు చేయించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ: పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎంఈవో మునిసుబ్రమణ్యం హెచ్చరించారు. ఆయన సోమవారం తలారివెట్టు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు.

గుడిసె దగ్ధం



నారాయణవనం: మండలంలోని పాలమంగళం నార్త్ ఎస్టీ కాలనీలో సోమవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. శక్తివేల్‌కు చెందిన గుడిసెలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దుస్తులతో పాటు ధాన్యం, వంట సరుకులు కాలిపోయాయని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

ఘనంగా వసంతోత్సవం

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు జ్యోతీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.

ముక్కంటి సేవలో..



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం ప్రముఖ ఇండియా క్రికెటర్ నవదీప్‌సైని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

సత్యవేడు: పట్టణంలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామని తెలిపారు. అనంతరం జెండా ఆవిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. నియోజవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

పిల్లలకు తల్లి ఒడి అంగన్‌వాడీ కేంద్రాలు



ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలకు తల్లిఒడిలాంటివని ప్రగతి సంస్థ డైరెక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం మండలంలోని పాయిల్ సెంటర్ అంగన్‌వాడీలో ప్రగతి సంస్థ, బెంగుళూరు క్రై సంస్థ ఆధ్వర్యంలో ఆట వస్తువులు, ఫర్నీచర్ వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంతో పాటు పిల్లలు, గర్భవతులు, బాలింతలకు కోడిగుడ్లు ఉచితంగా ఇస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ కృష్ణయ్య, పాపానాయుడుపేట పీహెచ్‌సీ డాక్టర్ మధురిమ, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ప్రగతి సంస్థ ప్రతినిధులు సుబోస్, సుమలత, రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శివయ్య ఆశీస్సులతోనే ముక్తిధామం ప్రారంభం

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



కైలాస ముక్తిధామం వద్ద ఎమ్మెల్యే, ఎంపీ తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని ఆశీస్సులతోనే దక్షిణ కైలాస ముక్తిధామాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి నదీ తీరం వద్ద దక్షిణ కైలాస ముక్తిధామాన్ని సోమవారం ఆయన ఎంపీ గురుమూర్తితో కలిసి ప్రారంభించారు. మొదటి ఫేస్‌లో భాగంగా ఎలక్ట్రికల్ బర్నింగ్ భవనాన్ని రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఉచిత వైకుంఠ రథాలను కూడా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాక్షాత్తు పరమశివుడు పుట్టిన శ్రీకాళహస్తిలో హిందువులకు శ్మశానవాటిక లేకపోవడం బాధాకరమన్నారు. అందుకే 2019లో తాను గెలవగానే ముందుగా శ్మశాన వాటిక పనులు మొదలుపెట్టానని చెప్పారు. మొత్తం మూడు ఫేజ్‌లు ఉండగా కరోనా కారణంగా పూర్తి చేయలేకపోయామని, నేడు మొదటి ఫేజ్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. మొదటి ఫేజ్‌కు రూ.3 కోట్లు వెచ్చించినట్లు ఆయన పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా శ్రీకాళహస్తిలో హిందువులకు శ్మశాన వాటిక లేదన్నారు. 30 సంవత్సరాలు పాలించిన బొజ్జల కుటంబానికి తమ స్వగ్రామం ఊరందూరులో శ్మశానం ఉందికానీ శ్రీకాళహస్తిలో మాత్రం చనిపోయిన వారికి పూడ్చడానికి స్థలం లేదన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, నాయకులు జనార్దన్‌రావుపవార్, గుమ్మడి బాలకృష్ణయ్య, ఉన్నం వాసునాయుడు, నాని, మధుసూదన్‌రావు, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాదరావు, ఉప్పు కృష్ణయ్య, పసల సుమతి, కంఠా ఉదయ్, రాము గుప్తా, కొండుగారి కృష్ణ, జయశ్యామ్, పాండు, మున్నా, భాస్కర్ పాల్గొన్నారు.

ముక్కంటికి సారె సమర్పణ


సారె అందజేస్తున్న సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ చైర్మన్ తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్లం గ్రామంలోని స్వయంభు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం తరఫున ఆలయ నిర్వాహకులు సోమవారం సారె సమర్పించారు. వారికి ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు స్వాగతం పలికారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వీటిని వేదపండితులకు అందజేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ చైర్మన్, చిల్లకూరు సాయిరెడ్డి, ఈఓ శశాంక్‌కుమార్, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- 'పచ్చ దండు' మాటల్ని నమ్మొద్దు
- రావిళ్లవారికండ్రిగ సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రావిళ్లవారికండ్రిగలో నూతన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఏ ఒక్క కార్యకర్తకు కష్టం వచ్చినా ఆదుకుంటామని, ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిగా చూస్తామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కల్లబొల్లి మాటలతో మూడు పార్టీలతో పచ్చదండు ప్రజల వద్దకు వస్తోందని, ఆ దండు చెప్పే మాటల్ని నమ్మరాదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ రాధాకృష్ణ, ఎంపీటీసీ సావిత్రమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీముల్లా, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్, పార్టీ నాయకులు గోపీ యాదవ్, రాజశేఖర్, హరి, సుబ్రమణ్యం, అర్జున్‌బాబు, పరమాల చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, కేశవులురెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ: జీతాలు చెల్లించాలని కోరుతూ మండలంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జీవో 680 విడుదల చేసి 10 నెలలు గడిసినా అమలుకు నోచుకోలేదన్నారు. కరోనాలో ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పారిశుద్ధ్య పనులు చేశామని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేల జీతం ఇవ్వాలని, పెండింగ్ జీతాలను ఇచ్చి, మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్లు, యూనిఫామ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఏవో త్రివిక్రమ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చిన్నిరాజ్, ధర్మయ్య, గంగయ్య, రాజా పాల్గొన్నారు.

● నృత్యం.. మంత్ర ముగ్ధం


శ్రీవల్లి బృందం నృత్యప్రదర్శన

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులను మంత్రముగ్ధుల్ని చేశాయి. హైదరాబాద్‌కు చెందిన శ్రీవల్లి బృందం ఒడిస్సీ నృత్య ప్రదర్శనతో సమ్మోహితుల్ని చేశారు. అలాగే తెనాలికి చెందిన నేరేళ్ల వరలక్ష్మి భక్తిగీతాలతో శివయ్యను అర్చించారు. తర్వాత చెన్నైకు చెందిన బృందం 'అన్ స్టాపబుల్ ఫ్యూజన్' ఉర్రూతలూగించింది.


చెన్నైకు చెందిన బృందం అన్ స్టాపబుల్ ఫ్యూజన్ కార్యక్రమం

ఘనంగా మహిళా దినోత్సవం


టీచర్లను సన్మానిస్తున్న ఎంఈవోలు

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో సోమవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ఎంఈవోలు బాబయ్య, జనార్ధనరాజు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ హైందవ సంస్కృతిలో మహిళలకు గొప్ప స్థానం ఉందని తెలిపారు. మహిళలు ఇంటిని చక్కబెట్టుకున్న విధంగానే పాఠశాల ప్రతిష్టతను మరింత ఇనుమడింపజేయడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరులు, విజయ్‌కుమార్, తంగరాజ్, రవి, మునిరత్నం, అశోక్ పాల్గొన్నారు.

రేణిగుంటలో..


రేణిగుంటలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రేణిగుంట: రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కృష్ణమంజరి ఆధ్వర్యంలో సోమవారం రేణిగుంటలో అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం మహిళలందరికీ దక్కాలని, అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే పోషణ పక్వాడ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హేమ, అనంతలక్ష్మి, శ్రీదేవి, భారతి, అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్షురాలు ధనమ్మ, రేణిగుంట, ఏర్పేడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం


చెల్లూరులో ప్రచారం చేస్తున్న పవిత్రారెడ్డి

ఏర్పేడు: మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చెల్లూరు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ, టీడీపీ హయాంలో ఏ పథకం పొందాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సివచ్చేదని, అయితే జగనన్న గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి అక్కాచెల్లెమ్మలంతా అండగా ఉండి వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచులు జ్ఞానప్రసూన, ఎంపీటీసీ రాధ, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు మధుయాదవ్, జీపీ యాదవ్, వేణు, జనార్ధన్, మునిరత్నం, మునికృష్ణయ్య, లోకయ్య, విజయ్, సాంబయ్య, మణి, రామయ్య ఆచారి, గుణశేఖర్ నాయుడు, రాజా తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిపట్టెడలో వేద పండితులు నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణోత్సవం

కల్యాణం.. కమనీయం

రేణిగుంట: మండలంలోని అత్తూరు పంచాయతీ అమ్మవారిపట్టెడలోని శివాలయంలో సోమవారం శివ పార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి,అమ్మవార్లకు గాజులమండ్యం మూలస్థానేశ్వరాలయ నిర్వాహకులు జువ్వల ధనంజయరెడ్డి, పుష్ప దంపతులు పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, బొందు దారాలు సమర్పించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్, మాజీ సర్పంచ్ హరినాథ్ యాదవ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిచ్చాటూరులో కేంద్ర బలగాల కవాతు



పిచ్చాటూరు: పిచ్చాటూరులో సోమవారం సాయంత్రం పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. పిచ్చాటూరు, నీరువాయి గ్రామం, హరిజనవాడలో పర్యటించారు. డీఎస్పీ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గానికి 3 కంపెనీల(300 మంది) పారామిలిటరీ బలగాలను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ వారంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందని, ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలు, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. పుత్తూరు ట్రైనీ డీఎస్పీ సింధు, సీఐ భాస్కర్ నాయక్, పిచ్చాటూరు, కేవీబీపురం ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలో ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న జెడ్పీటీసీ విజయలక్ష్మి

సత్యవేడు: చెన్నైలోని ఆల్వార్‌పేట హయ్యర్ సెకండరీ స్కూల్ స్టేడియంలో జరిగిన కరాటే కటా, కుమితే పోటీల్లో సత్యవేడు విద్యార్థులు(బాలికలు) సత్తాచాటి ఏడు బంగారు, మూడు సిల్వర్ పతకాలు సాధించారు. ఈ నెల 10న షిటోరియా కెన్ కరాటే డూ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఉమెన్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్- 2024 పోటీలు నిర్వహించారు. సత్యవేడు కరాటే అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థినులు ఈ పోటీల్లో ప్రతిభ చాటారు. అండర్ 5–8లో కటా ఈవెంట్‌లో జీబీ లక్షిక, అండర్ 8–12లో పి.ఇషాంక, కారుణ్య, కావ్య బంగారు పతకాలు, కుమితే విభాగంలో 8–12లో పి.ఇషాంక, కావ్య, కారుణ్యాజోసేలీ బంగారు పతకాలు, కటా ఈవెంట్‌లో కే.పవిత్ర, కే.యువశ్రీ జీ.యశశ్విని సిల్వర్ పతకాలు సాధించారు. మాస్టర్ స్కూల్ విద్యార్థులను జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, వైఎస్సార్ సీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. చంద్రశేర్ రెడ్డి అభినందించారు. సత్యవేడు కరాటే అకాడమీ మాస్టర్లు జీఎం.భువనేశ్వర్, టి.సూర్య, కరస్పాండెంట్ శ్రీనివాసులు రెడ్డి, సురుటుపల్లి ఆలయ కమిటీ సభ్యుడు మునివేలు, అనిత, షాజిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ సిబ్బంది సేవలు అభినందనీయం


అభినందిస్తున్న ఆలయ చైర్మన్ బాలాజిరెడ్డి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి సర్వమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన మహా శివరాత్రి ఉత్సవాల్లో శ్రీసిటీ భద్రతా సిబ్బంది సేవలు అభినందనీయమని ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజిరెడ్డి, ఈవో కె.రామచంద్రారెడ్డి తెలిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణం, గ్రామోత్సవంలో విశేష సేవలు అందించారని కొనియాడారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫరీద్‌బాబాకు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న డాక్టర్ ఫరీద్‌బాబా

రేణిగుంట: స్థానిక జబ్బార్ ట్రస్ట్ అధినేత డాక్టర్ షేక్ ఫరీద్‌బాబా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విశిష్ట పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవలను చేసిన వారికి ఆర్‌కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ అవార్డులు ప్రకటించింది. హైదరాబాద్‌లోని సారస్వత పరిషత్ భవనంలో సంస్థ వ్యవస్థాపకుడు రంజిత్, పలువురు మహిళా న్యాయమూర్తుల చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. రేణిగుంటకు చెందిన తనకు ఈ పురస్కారం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని ఫరీద్‌బాబా సంతోషం వ్యక్తం చేశారు. అలాగే సేవా పురస్కార్ అవార్డును షేక్ హసీనా భానుకు ప్రదానం చేశారు.

నియామకం ఏకగ్రీవం


మాట్లాడుతున్న మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటరమణారెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీకి చెందిన బోడవరం సర్పంచ్ నాగోలు వెంకటరమణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సర్పంచుల సంఘం ఎన్నిక సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో మొత్తం 27 పంచాయతీలకు గాను 23 మంది వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచులు ఉండగా, టీడీపీకి నలుగురు మాత్రమే ఉన్నారు. ఇక, సంఘ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా తొట్టంబేడు సర్పంచ్ సుబ్బయ్య, పొయ్య సర్పంచ్ సక్కుబాయమ్మ, సాంబయ్యపాళెం సర్పంచ్ సుజాతమ్మ, కార్యదర్శిగా ఇలగనూరు సర్పంచ్ సుబ్రమణ్యంనాయుడు, సహ కార్యదర్శులుగా కాశి సుబ్రమణ్యం, కోశాధికారిగా కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన బియ్యపు శ్రీవాణిరెడ్డి మండ సర్పంచుల సంఘం అధ్యక్షులు, సభ్యులను అభినందించారు. అందరి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని వెంకటరమణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, వైస్ ఎంపీపీ మల్లికమ్మ, ఎంపీడీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల వాహనం ఇంజిన్ దగ్ధం

- బియ్యం బస్తాలను ట్రాక్టర్‌లో తరలింపు



ఏర్పేడు: షార్ట్ సర్క్యూట్‌తో నిత్యావసర సరకుల పంపిణీ వాహనం ఇంజిన్ దగ్ధమైన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని ఎండీపుత్తూరు పంచాయతీ మిట్టఇండ్లులో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం.. వలంటీర్ మహేష్ రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు మిట్టఇండ్లుకు సోమవారం సాయంత్రం 5.50 గంటలకు ఏపీ 39 టీఆర్ 3360 నంబర్ కలిగిన వాహనంతో చేరుకున్నాడు. గ్రామంలోని లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తుండగా వాహనంలోని వైర్లు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. ఈ ప్రమాదంలో వాహనం ఇంజిన్ దగ్ధమైంది. సమాచారం అందుకున్న సర్పంచ్ మోహనప్రియ అక్కడికి చేరుకుని వాహనంలోని బియ్యాన్ని ట్రాక్టర్‌లోకి తరలించారు. జరిగిన ఉదంతాన్ని తహసీల్దారు ఉదయ్ భాస్కర్ రాజు, పోలీసులకు తెలియజేశారు.

నేడు గిరిప్రదక్షిణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో గిరిప్రదక్షిణ అనేది కల్యాణానికి వచ్చిన దేవతలు, రుషులకు వీడ్కోలు పలికే యాత్రగా పురాణాల్లో ప్రస్తావన ఉంది. కల్యాణానికి వచ్చిన రుషులను, దేవతలను సాగనంపేందుకు శివయ్య విల్లంబులు ధరించి వారిని స్వస్థలాలకు చేరుస్తారనే ప్రతీతి. దీనినే రుషిరాత్రి అని కూడా అంటారు. గిరిప్రదక్షిణ తరువాత పట్టణానికి తిరిగి వచ్చే స్వామిఅమ్మవార్లకు భక్తులు వేలాది ఎదురుసేవ మండపం వద్దకు చేరుకుని స్వాగతం పలకడం ఆనవాయితీ. ఆలయం తరఫున గిరిప్రదక్షిణ మార్గంలో అన్ని ఏర్పాట్లు చేశారు. తాగునీరు, అన్నదానం, మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఆలయ ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. అంజూరు మండపం వద్ద అన్నదానం చేస్తారు. ఎమ్మెల్యే ఉభయదారుడిగా వ్యవహరిస్తారు.

పుష్ప ఫల ప్రసాదం: ఆలయాన్ని 27 రకాల పుష్పాలు, 9రకాల పండ్లతో అలంకరించారు. వాటిని గిరి ప్రదక్షిణకు వెళ్లే సమయంలో నాలుగు మాడవీధుల్లో ప్రజలకు పంచిపెట్టనున్నారు.

సింహ వాహనంపై శ్రీహరి చిద్విలాసం



తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలోని టీటీడీ అనుబంధ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం స్వామివారు సింహ వాహనంపై పురవీధుల్లో విహరించారు. సర్వాలంకారభూషితుడైన స్వామి వారు భక్తులకు అభయ ప్రదానం చేశారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

అక్సోరా కార్మికుల ఆందోళన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తమకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని నిరసిస్తూ సోమవారం అక్సోరా కర్మాగారం కార్మికులు ధర్నా చేశారు. తొట్టంబేడు మండలం రౌతుసూరమాల పంచాయతీలోని ఈ కర్మాగారంలో దాదాపు 70 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు ఇవ్వాలని ఎప్పుడు అడిగినా కొన్ని రోజులు ఆగితే ఇస్తామంటూ యాజమాన్యం చెబుతోందని, పైగా. కర్మాగారంలో ఉన్న సుమారు రూ.4కోట్ల విలువైన ముడిసరుకును ప్రాసెస్ పనులు పూర్తి చేయాలని తమపై ఒత్తిడి పెంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత్యంతరం లేక ఆందోళన చేయాల్సి వచ్చిందని, కార్మికశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీని ఆదరించండి

కేవీబీపురం (పిచ్చాటూరు): మండలంలోని దిగువ పుత్తూరు, ఎగువ పుత్తూరు, కోట మంగాపురం గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు అగ్రహారం హరిబాబు మాజీ జెడ్పీటీసీ డేవిడ్‌తో కలిసి పర్యటించారు. బీసీ, ఎస్సీ నేతలతో సమావేశమై చర్చించారు. చేసిన మేలును గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎస్సీ సెల్ మండల కన్వీనర్ అరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.